•

కాకి బంగారం

"నాన్నమ్మ ఎప్పుడూ నన్ను ఎందుకు కోప్పడుతుంది డాడీ!" అన్నాడు అశోక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూసి మెచ్చుకొన్న తండ్రితో.

"ఊరికనే ఎందుకు కోప్పడుతుంది! నువ్వేదో పాడుపని చేసివుంటావ్! అవునా?" అన్నాడు నరేంద్ర చిరునవ్వుతో.

"లేదు డాడీ! నేనే పాడుపనీ చెయ్యలేదు! నిజం! గాడ్ ప్రామిస్, కావాలంటే మమ్మీని అడుగు" అన్నాడు.

"అశోక్! నో కంప్లైంట్స్ అని చెప్పేనా! తమ్ముడు సోనీ చూడు! బుద్ధిగా చెప్పిన మాట వింటాడు. హార్లిక్స్ కలిపి డైనింగ్ టేబిల్‌మీద పెట్టేను వెళ్ళితాగు!" అంది ప్రశాంతి భర్తకు కాఫీ కప్పు అందిస్తూ.

నరేంద్ర భార్యవైపు ప్రశ్నార్థకంగా చూసేడు. అయితే ఆమె భర్తచూపు గమనించనట్లే మిన్నకుంది.

"అశోక్! నీ ప్రోగ్రెస్ రిపోర్ట్ మమ్మీకి చూపించేవా?" అన్నాడు.

"నాది తమ్ముడిది కూడ చూసింది మమ్మీ" అన్నాడు ఉత్సాహంగా.

"అదేంటోయ్! పుత్రరత్నాలు ఘనకార్యం సాధించుకొస్తే సంతోషించక ముఖం అలా పెట్టేవ్!" అన్నాడు నరేంద్ర భార్యను కవ్విస్తూ.

సోనీ హార్లిక్స్ గ్లాసు తెచ్చి అన్నకిచ్చేడు.

"గుడ్‌బోయ్!" అని చిన్నకొడుకుని దగ్గరకు తీసుకున్నాడు.

"అశోక్, సోనీ మీరిద్దరూ డ్రస్సు మార్చుకుని కాస్సేపు బయటకు వెళ్ళి

ఆడుకోండి!" అని కాఫీ కప్పూ, గ్లాసూ తీసుకుని కిచెన్‌వేపు వెళ్ళింది ప్రశాంతి.

భార్య వెళ్ళినవేపు చూసి నిట్టూర్పు విడిచేడు నరేంద్ర.

'ఆమెకున్న శాంతం, సహనం, ఓర్పు. నేర్పూ మరే స్త్రీకి వుండవేమో!' అనుకున్నాడు.

ప్రశాంతి స్టేట్‌బ్యాంక్‌లో ఆఫీసర్‌గా జాబ్ చేస్తోంది. నరేంద్ర యూనియన్ బ్యాంక్‌లో ఆఫీసరు.

ఉదయాన్నే టిఫెన్, వంటా చేసి పదిగంటలకు భర్త పిల్లలతో కలిసి భోజనం చేసి, టిఫెన్ బాక్సులు ఇచ్చి పిల్లల్ని స్కూల్‌కి పంపి భర్తతో కలిసి బేంక్‌కి వెళ్తుంది ప్రశాంతి. రెండు బేంక్‌లూ ఒకే స్ట్రీట్‌లో వున్నందున ఇద్దరూ స్కూటర్‌మీద వెళతారు. ఆమె అత్తగారు 12 గంటలకు భోజనం చేస్తారు. ఆవిడకు లంచ్ డైనింగ్ టేబిలు మీద వుంచుతుంది. సాయంత్రం ఐదుగంటలకు ఇంటికొస్తుంది. పిల్లలిద్దరూ 4 గంటలకే స్కూల్‌నుంచి వచ్చేస్తారు. ఇంటికి రాగానే ముందు హార్లిక్స్ కలిపి పిల్లలిద్దరికీ

ఇచ్చి తరువాత కాఫీ కలిపి అత్తగారికిచ్చి తనూ భర్తా తీసుకుంటారు. తరువాత రాత్రికి వంట ప్రయత్నం చేస్తుంది.

అశోక్ వయస్సు 6 సంవత్సరాలు. 3వ క్లాస్ చదువుతున్నాడు. సోనీ వయసుస నాలుగు సంవత్సరాలు. ఒకటవ తరగతి చదువుతున్నాడు. ఇద్దరూ తెలివైనవాళ్ళే. చురుకైన పిల్లలే! అయితే అశోక్ కాస్త అమాయకుడు. సోనీ గడుసువాడు.

ప్రశాంతి వంటవగానే పిల్లలిద్దర్నీ కూర్చుండబెట్టి స్కూల్ హోంవర్క్ చేయించి చదివిస్తుంది. భర్తక్లబ్ నుండి వచ్చిన వెంటనే అందరూ కలిసి డిన్నర్ చేస్తారు.

ఏడాది క్రితం వరకూ ప్రశాంతి అత్తగారు పార్వతమ్మగారు కోడలికి వంటపని యింటిపనిలో ఎంతో హెల్ప్ చేసేవారు. మనవలు స్కూల్‌నుంచి రాగానే వారికి ఏదైనా టిఫిన్ చేసి పెట్టడం, హార్లిక్స్ కలిపి ఇవ్వడం లాటి పనులు చేసేవారు. ఏడాది నుండీ ఆవిడ యింట్లో ఏపనీ ముట్టుకోవడం మానివేసారు. ప్రతి చిన్న విషయానికీ కోడల్ని తప్పుపట్టడం మనవల్ని కసరడం వంటివి చేస్తున్నారు. అయితే కొడుకు ఎదుట ఆవిడ నోరు విప్పదు.

పార్వతమ్మగారి ప్రవర్తనలో అంతమార్పు రావడానికి కారణం ఆమె కూతురు సుమిత్ర. సుమిత్ర భర్త ముకుందరావు ఎల్.ఐ.సిలో జాబ్ చేస్తున్నాడు. ఏడాది క్రిందట ట్రాన్స్‌ఫరై ఆవూరు వచ్చేడు. పార్వతమ్మగారికి కూతురంటే వల్లమాలిన ప్రేమ.

"ఏంటమ్మా! నువ్వు మరీ అంత అమాయకంగా వుంటే ఎలాచెప్పు! ఈ వయస్సులో హాయిగా కాలుమీద కాలువేసుకుని కూర్చొని కోడలు చేత సేవలు చేయించుకోవాలి! ఆవిడగారేమో చక్కగా ముస్తాబై టింగురంగాలా ఆఫీసంటూబయట తిరిగొస్తుంటే నువ్వేమో ఆవిడగారికీ, ఆవిడగారి పిల్లలకీ చాకిరీ చెయ్యడం సిగ్గుగా లేదూ! ఇకనుంచీ నువ్వేపనీ పూనుకొని చెయ్యకు" అని తల్లికి పదే పదే సలహా ఇచ్చింది సుమిత్ర.

కూతురి సలహా చక్కగా అమలు పరిచేరు పార్వతమ్మగారు.

ప్రశాంతి అత్తగారు ఎన్ని అన్నా ఏమీ పట్టించుకోదు. ఆవిడ గురించి భర్తకు ఏనాడూ కంప్లైంట్ చెయ్యలేదు. అంతేకాదు పిల్లల్ని కూడ కంట్రోల్ చేసి ఏమీ చెప్పనివ్వదు.

పార్వతమ్మగారికి గులాబి మొక్కలంటే ఇష్టం. వంద రూపాయలిచ్చి నాలుగు

హైబ్రీడ్ గులాబి మొక్కలు- తెలుపు, ఎరుపు, పసుపు, నీలం రంగు పువ్వులవికొని ఆగోలేలు పోర్టికోలో వుంచేరు.

సోనీ బర్త్‌డేకి ప్లాస్టిక్ బేటూ, రబ్బర్ బాల్ కొనిచ్చేడు నరేంద్ర. "వాటితో యింట్లో ఆడకూడదని, బయట లాన్‌లోనే ఆడుకోవాలి" అని ప్రశాంతి పిల్లలకి చెప్పింది. వారు బయట లాన్‌లో ఆడుకోబోతే బంతి పోర్టికోలో వున్న గులాబి మొక్కల గోలేలకు తగలవచ్చు. అందువల్ల అక్కడ ఆడవద్దని కట్టడి చేసారు. పార్వతమ్మగారు. దాంతో పిల్లలు బేటూ, బాల్ గదిలో బీర్వాక్రింద దాచివేసి మరి వాటిని ముట్టుకోలేదు.

అయితే ఆరోజు సాయంత్రం మొక్కలకు నీరు పోస్తూ పసుపు రంగు గులాబి మొక్కగోలెం చిట్లి వుండడం చూసేరు పార్వతమ్మగారు. దానిని పిల్లలే పగలకొట్టి వుంటారని వారు స్కూలునుంచి రాగానే కేకలేసి తిట్టి నానా హంగామా చేస్తున్నారు పార్వతమ్మగారు.

ప్రశాంతి యింటికి వచ్చేసరికి పిల్లలిద్దరూ ఆవిడ ఎదుట దోషులులా నిల్చుని వుండడం గమనించి విషయం తెల్సుకుని బట్టలైనా మార్చుకోకుండా వెంటనే బజారుకి వెళ్లి కొత్తగోలెం ఒకటి కొనితెచ్చి మొక్కను మార్చింది. పాతది గోలెం నాసిరకంది అవటంవల్ల నీటికి తడిసి అది విచ్చిపోయిన విషయం అత్తగారికి చూపించేవరకూ ఆవిడ శాంతించలేదు. పిల్లలే పగలగొట్టేరని ఆవిడ వాదన.

ఆడబడుచు సుమిత్రకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు రాకేష్ ఆరవక్లాస్ చదువుతున్నాడు. రెండోవాడు నరేష్ నాల్గవ తరగతి చదువుతున్నాడు.

పిల్లలిద్దరూ రణపెంకి. వాళ్ళకి ఏమాత్రం భయం భక్తిలేవు. వాళ్ల చదువులు అంతంత మాత్రంగానే వున్నాయి. తల్లితండ్రీ వాళ్ల చదువు విషయం ఏమాత్రం పట్టించుకోరు.

రెండు మూడు రోజులకోమారు సుమిత్ర పిల్లల్ని వెంటేసుకుని తల్లి దగ్గరకు వస్తుంది. వాళ్లకి టిఫిన్, భోజనం ప్రశాంతి చేసిపెట్టాలి. పిల్లలు బూట్లుకాళ్లతో సోఫాలూ, కుర్చీలూ, పరుపులూ, కార్పెట్ తొక్కి పాడుచేస్తుంటారు. అంతేకాదు అశోక్, సోనీల ఆటవస్తువులూ పెన్నులూ, పెన్సిళ్లూ విరగగొట్టి ఆనందిస్తుంటారు. వారిని గిచ్చడం, కొట్టడం వంటి పనులు చేస్తున్నా అటు పార్వతమ్మకాని ఇటు సుమిత్రకాని వాళ్లని వారించి మందలించరు.

పిల్లలకోసం కోడలు యింట్లో చేసివుంచిన వంటకాలు వెంటనే కూతురు

పిల్లల్ని పిలిచి వాటినన్నిటినీ పంచేస్తుంది పార్వతమ్మ. అంతేకాదు, వాళ్లు యింటికి వచ్చేసరికి-ఇంట్లోని పాలు, హార్లిక్స్ కలిపి వాళ్లకి బలవంతంగా త్రాగిస్తుంది. ప్రశాంతి చాలామార్లు ఆఫీసు నుంచి వచ్చి పిల్లలకు ఇవ్వడానికి పాలులేక బూత్‌కి వెళ్లి పాలపేకెట్స్ తెచ్చుకోవలసి వచ్చేది.

కోడలికి చెప్పకుండా యింట్లో ఉండే గ్యాస్ స్పేర్ సిలెండర్‌ని కూతురికిచ్చి దానిప్లేస్‌లో ఖాళీ సిలెండర్ పెట్టేసి.... కోడలికి చెప్పేదికాదు పార్వతమ్మ.

వంటపనికి, ఇంటిపనికీ మనిషిని పెట్టుకుంటే ఆ పనిమనిషితో పోట్లాడి కావాలని దానిని పనినుంచి తీసేసేది పార్వతమ్మ. దాంతో పనిమనిషిని పెట్టుకోవడమే మానుకుంది ప్రశాంతి.

సుమిత్ర పిల్లలు అడగ్గానే వాళ్లకి ఆడుకునేందుకు క్రికెట్ బేటూ, బాలు కొనిచ్చింది పార్వతమ్మ. వాళ్లు వాటితో డ్రాయింగ్ రూమ్‌లో ఆడుతున్నారు.

తల్లీకూతురూ సోఫాలో కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"బాబూ! క్రికెట్ యింట్లో ఆడకూడదు! బయట లాన్‌లో ఆడుకోవాలి! లేకుంటే బాల్ టీ.వీకికాని, మనుషులకుగాని తగుల్తుంది" అంది ప్రశాంతి సౌమ్యంగా, ఆఫీసుకు బయలుదేరుతూ.

"పిల్లలు ఎండలో ఎక్కడ ఆడతారు! వాళ్ళేం చిన్నపసిపాపలు కారు. వాళ్లకి జాగ్రత్త తెలుసు! కాస్సేపు ఆడుకున్నంత మాత్రాన ప్రమాదమేం జరిగిపోదు. నువ్వు వెళ్లు" అన్నది పార్వతమ్మ. తల్లి మాటలకి చిరునవ్వు నవ్వింది సుమిత్ర.

ప్రశాంతి యింకేమీ మాట్లాడకుండా చెప్పులు వేసుకుని బయటకు నడిచింది. భర్త తొలిరోజే కేంప్ వెళ్లడంవల్ల ఆటోలో ఆఫీసుకు వెళ్లింది. అంతకు అరగంట ముందే పిల్లలు కాన్వెంట్‌కి వెళ్లేరు.

సుమిత్ర కాస్సేపు కూర్చుని తల్లితో కబుర్లు చెప్పి 'పనివుందని' యింటికి వెళ్లిపోయింది.

"పిల్లలకి భోజనం పెట్టి తరువాత పంపిస్తా" అన్నది పార్వతమ్మ కూతురితో-

వాళ్లు క్రికెట్ ఆటకోసం స్కూల్ ఎగ్గొట్టేరు.

మనవల ఆటచూసి మురిసిపోతోంది పార్వతమ్మ.

చిన్నవాడు నరేష్ బలంగా కొట్టిన బంతి నేరుగా వెళ్లి పార్వతమ్మ కుడికంటికి తగిలింది.

ఆ దెబ్బకు ఆవిడ చావుకేక పెట్టి పడిపోయింది నెత్తురు బొటబొట కారుతోంది. అంతే, పిల్లలిద్దరూ బేటూ బాలు అక్కడే పారేసి వాళ్లింటికి పరుగులంకించుకున్నారు.

పిల్లలిద్దరూ భోజనం చెయ్యకుండా వచ్చినందుకు వాళ్ళని తిట్టింది. అప్పుడు మళ్ళీ వాళ్ళకోసం వంట చెయ్యాలని విసుక్కుంది. 'తిండి పెట్టకుండా తరిమివేసిందని' తల్లిని నిందించింది సుమిత్ర.

సాయంత్రం నాలుగు గంటలకు అశోక్, సోనీ, స్కూల్ నుంచి వచ్చేర్సు. అశోక్ నాయనమ్మ పరిస్థితి చూసేడు. తమ్ముడ్ని యింటి దగ్గర వుండమని, వెళ్లి ఆటోని పిల్చుకొని వచ్చేడు. ఆవిడను ఆటోడ్రైవర్ సహాయంతో హాస్పటల్‌కి తీసుకొనివెళ్లి అక్కడ నుండి తల్లికి ఫోన్‌చేసి చెప్పేడు.

ప్రశాంతి వెంటనే హాస్పటల్‌కి వచ్చి అత్తగారిని చూసింది.

"మేడమ్! మీ అబ్బాయి సకాలంలో ఈవిడను హాస్పటల్‌కి తీసుకొచ్చేడు కనుక సరిపోయింది. ఇంకా లేటయివుంటే కంట్లో క్లాటైన బ్లడ్‌వల్ల కన్నుపోయేది" అన్నాడు డాక్టర్, పార్వతమ్మగారి కంటికి కట్టుకడుతూ ప్రశాంతితో.

"అమ్మా ప్రశాంతీ! యిన్నాళ్లూ నాకళ్లకేదో పొరలు కమ్మి అసలు బంగారమేదో కాకిబంగారమేదో కానుకోలేకపోయినందుకు నన్ను క్షమించు!" అంటూ కళ్లు మూసుకునే గుణిసింది అత్తగారు పార్వతమ్మ-

('ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక', మే 2000) ✪